క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ముగిసిన ఎంబ్రాయిడరీ శిక్షణ తరగతులు



ధ్రువపత్రాలు అందిస్తున్న సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని స్కిల్ హబ్‌లో జరుగుతున్న హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. శిక్షణ తీసుకున్న 24 మందికి సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి. రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ నాగమణి, నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, స్కిల్ హబ్ ట్రైనర్ టి.మంజులాకుమారి, కో ఆర్డినేటర్ బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ మరణం ఇటీవల సంభవించలేదు

సింహాచలం: అడవివరంలో ఇటీవల ఎలాంటి డెంగ్యూ మరణం సంభవించలేదని, ఆ ప్రాంతానికి చెందిన కొరెడ్డి జనార్దన్ (30) డెంగ్యూతో కేజీహెచ్‌లో ఇటీవల మృతి చెందలేదని, అతను 2019లో మృతి చెందాడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. అతను 2019లోనే జ్వరంతో బాధపడుతూ సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది తదుపరి కేజీహెచ్‌కి రిఫర్ చేయబడ్డాడని తెలిపారు. కేజీహెచ్‌లోనే మృతి చెందాడని తెలిపారు.

భగవాన్ బిర్సా ముండాకు ఘన నివాళి



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

పెందుర్తి: ఆదివాసీల అస్తిత్వం, జీవన స్థితిగతుల మెరుగునకు కృషి చేసిన పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం ఘన నివాళి అర్పించారు. మండలంలోని రాంపురంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దత్తోపంత్ తెంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో ఎస్టీ కులాలకు సంబంధించిన విద్య, ఉపాధి అవకాశాల కోసం సభ్యత్వ నమోదు చేశారు. ఎంపీడీవో వెంకటరావు, ఏఎస్‌ఐ బాబూరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి, పెందుర్తి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం జయప్రసాద్, బీజేపీ నాయకుడు భూపతి అప్పారావు, జాతీయ కార్మిక రీజినల్ డైరెక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులకు అభినందన



బంగారు పతకం సాధించిన నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ -2024 పోటీల్లో విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులు తమ ప్రతిభ చూపారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ట్రయిల్ బ్లాజర్ అనే టీమ్‌లో మొత్తం 7 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకం సాధించిన వారిని అధికారులు, మిగిలిన సిబ్బంది అభినందించారు.

అక్రమార్కులకే వత్తాసు

- జోన్-8లో జోరుగా అక్రమ నిర్మాణం
- వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



పశువుల ఆస్పత్రి సమీపంలో బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని నిర్మిస్తున్న భవనం

పెందుర్తి: అక్రమ నిర్మాణాలకు జీవీఎంసీ జోన్-8 టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తమ వంతు సహకరిస్తున్నట్లు జోరుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడికక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా కనీసం వాటిపై ప్రాథమిక విచారణ కూడా చేయడం లేదంటే టౌన్‌ప్లానింగ్ అధికారుల పని తీరు ఏమిటో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలంటున్నారు.

నిబంధనలు మీరినా పట్టించుకోవడంలేదు..

జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వద్ద బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఒకే స్థలంలో రెండు భారీ భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ భవనాల నిర్మాణంలో మాయాజాలం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇంతటి భారీ భవనాలకు కేవలం 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. భారీ భవన నిర్మాణానికి కనీసం 40 అడుగుల రోడ్డు నాలుగు వైపుల ఉంటేనే అనుమతి ఇవ్వాలి. అయితే ఇక్కడ ఒక భవనానికి అనుమతి ఇచ్చారు. ఆ ప్లాన్‌ను అడ్డం పెట్టుకున్న బిల్డర్ దానికి సమాంతరంగా మరో భవనం నిర్మిస్తున్నాడు. ఈ భవనానికి ఎక్కడా సెట్ బ్యాక్స్ లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే నివారించడానికి ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకునే వీలు లేదు. పెందుర్తి ప్రాంతంలో ఇటీవల కాలంలో భారీ భవంతుల్లో అగ్ని ప్రమాదాలు, ఇతరత్రా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న తరుణంలో భవనాల అనుమతులపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తరహా భవనాలపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ఈ భవన నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– శిరీష, సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శి

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సాయిప్రకాష్, నరసింహం తదితరులు

సింహాచలం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ కార్యాలయ విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు తిరునగిరి సాయిప్రకాష్ అన్నారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచి పుస్తకం ఆరోగ్యకరమని తెలియజేశారు. నేడు ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కి బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సెల్‌ఫోన్‌కి దూరంగా ఉండాలని సూచించారు. కాగా విజ్ఞానం, వినోద పంచే పుస్తకాలు, పలు కాంపిటీటివ్ పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. పాఠకులు, విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, కార్మిక నాయకుడు సీహెచ్‌ఎస్ఎన్ రాజు, ఐఏఎస్ కోచింగ్ అకాడమీ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ బి.బి. రాజేష్, పాఠకులు టీవీకే వర్మ, భాను, సురేష్, కవిత, అను, హరీష్ పాల్గొన్నారు.

జూడో విజేతకు అభినందనలు



జూడో విజేత శీలంశెట్టి మధు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి శీలంశెట్టి మధు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల జూడో పోటీలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి శుక్రవారం తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న మధు విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన పోటీలో 60 కేజీల విభాగంలో ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా వచ్చే నెల 22వ తేదీన జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే క్రీడా పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థికి కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మితో పాటు, అధ్యాపకులు డాక్టర్ వి.వి. గోపాలకృష్ణ, ఎంవీ రామకృష్ణ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త లెక్కల గణేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఆరిపాక షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



సాయిబాబాను దర్శించుకుంటున్న రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండంలోని ఆరిపాకలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళా కోలాటం పోటీలను ప్రారంభించారు. గత 8 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం స్వామివారి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించిన ఆలయ ధర్మకర్త, తుంపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకుడు బోకం రామునాయుడు, ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, మళ్ల బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బి. మహాలక్ష్మినాయుడు, శరగడం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాస రచన పోటీలు



శాఖా గ్రంథాలయంలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ప్రొఫెసర్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న అతిథులు

పెందుర్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గ్రంథాల గురించి, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు విద్యార్థులపై పడుతున్న మానసిక ఒత్తిడి అంశంపై పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఉపాధ్యాయులు జగదీష్, వాణి, దోబులు, సంగీత శిక్షకురాలు భానుమతి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'జాతీయ జెండా', 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు 'విశాఖ బీచ్'అంశాలపై చిత్రలేఖనం పోటీలు, నాలుగో రోజు ఆదివారం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'శారీరక పరిశుభ్రత', 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు 'చదవడం మాకిష్టం', సాహిత్య గోష్టి-ఇష్టాగోష్టి, ఐదోరోజు సోమవారం పుస్తక ప్రదర్శన, ఆరో రోజు మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు, ఇందిరాగాంధీ జయంతి, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజు బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతాయన్నారు.

ఆదర్శ్‌లో:

స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రభాకర్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీ, ఎన్‌డీఎల్, ఈపీజీ పాఠశాల, విద్యా మిత్ర, సోద్ గంగ, స్వయం ప్రభ, ఈజ్ఞాన్ కోష్ తదితర ఆన్‌లైన్ పోర్టల్‌ల ద్వారా విజ్ఞానం అందుబాటులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయా సాంకేతికతను వినియోగించుకుని లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ. ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కార్తీక దీపోత్సవం



పూజలందుకున్న సత్యనారాయణస్వామి





దేవీపురంలోని సహస్రాక్షి అమ్మవారు, పంచభూత లింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

పెందుర్తి: సాధూమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి అర్చనలు జరిపారు. కుంభ హారతి, నక్షత్ర హారతి, బిల్వ హారతి, నంది హారతులు ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బి.మురళీ శర్మ, ఉపేంద్రశర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజలు జరిపారు. సాయంత్రం జ్వాలా తోరణం వెలిగించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దేవీపురంలో..

సబ్బవరం:మండలంలోని పలు శైవ క్షేత్రాలు, దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అదే విధంగా దక్షవాటిలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి అలంకరణ అనంతరం ద్వి సహస్ర లింగ పంచభూత లింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పరవాడ శివాలయంలో..



పరవాడ శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ వెంకటలక్ష్మి దంపతులు, భక్తులు

పరవాడ: మండలంలోని పరవాడ శివాలయంలో శివ కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరవాడ ఉపసర్పంచ్ బందారు రామారావు, మాజీ ఆర్‌ఈసీఎస్ చల్లా కనకారావు, నాయుకులు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా జ్వాలాతోరణం..

సింహాచలం: విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, 98వ వార్డు పరిధిలోని సింహపురికాలనీ, కాపుదిబ్బ, పాత అడవివరం, 93వ వార్డులోని ప్రహ్లాదపురంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పెందుర్తి: శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిపారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో జ్వాలా తోరణం వెలిగించారు.



జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో లక్ష దీపార్చన

గౌరీపరమేశ్వరుల క్షేత్రంలో..

సబ్బవరం: పెదయాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీపరమేశ్వరుల క్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో రాత్రికి నిర్వహించిన లక్ష దీపార్చన కార్యక్రమంలో వేలాది మందిగా భక్తులు దీపార్చన కార్యక్రమం నిర్వహించారు.

రాధాకృష్ణ మహోత్సవానికి యాదవ సంఘం ప్రతినిధులు



రాధాకృష్ణ మహోత్సవానికి తరలి వెళ్తున్న యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: నగరంలో శుక్రవారం నిర్వహించిన శ్రీరాధాకృష్ణ మహోత్సవానికి పెందుర్తి యాదవ సంఘం ప్రతినిధులు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అయిత సింహాచలం, చందక చలపతిరావు, కాయిత ఎర్రిబాబు, ఉరుకూటి గోవింద్, కోడిబోయిన శ్రీను, పీతల విష్ణు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాకేతపురంలో ఫ్రైడే-డ్రైడే



సాకేతపురంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురం ప్రాంతంలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్లాప్ వాహనాలకు చెత్త అందించాలని ప్రజలకు సూచించారు. వార్డులోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు జెడ్సీ రాముకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీవో కృపానందరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైడిమాంబ ప్రతిమ ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన పైడిమాంబ ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట పైడిమాంబ ఆలయంలోని ఉత్సవ ప్రతిమను దుండగులు ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రధాన ఆలయం వెనుక ఉన్న ఉత్సవ విగ్రహ చేతులను గుర్తు తెలియని వారు ధ్వంసం చేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి ప్రధాన దేవాలయం వెనుక ఉన్న ఈ ప్రతిమలకు నిత్య పూజలు చేసేవారమని, ప్రతిమలు ధ్వంసం చేయడం దారుణమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞానం.. విజ్ఞానం




పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ దివ్య

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో సబ్బవరం ఎస్‌ఐ టి. దివ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్‌లకు హత్తుకుపోతూ పుస్తక పఠనాన్ని మరిచిపోతున్నారన్నారు. అందరూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవరుచుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, ఉపాధ్యాయులు పాణితో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్ర గస్తీపై శిక్షణ



మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు శిక్షణ ఇస్తున్న ఐఎన్‌ఎస్ ఘరియాల్ అధికారి

ఎంవీపీకాలనీ: సముద్ర భద్రత కోసం ఐక్య ఫ్రంట్‌లో భాగంగా ఐఎన్‌ఎస్ ఘరియాల్ అధికారులు మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు ఉమ్మడి గస్తీపై శిక్షణ ఇచ్చారు. మొజాంబిక్‌లోని పోర్ట్ నకాలా నుంచి ఈ నెల 12న ఐఎన్‌ఎస్ ఘరియాల్ బయలు దేరిన సమయంలో ఈ శిక్షణ జరిగింది. జాయింట్ ఈఈజెడ్ గస్తీ, సముద్ర రైడర్లకు ఎన్‌బీసీడీ, వీబీఎస్ఎస్, ఇంజిన్ అండ్ స్విచ్‌బోర్డ్ నియంత్రణలపైనా మొజాంబికన్ దళాలకు శిక్షణ అందించారు.